క్లుప్తంగా

విరాళం

ఎదులాపురం: రిక్షా కాలనీలోని శ్రీరామ మందిర నిర్మాణం కోసం డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ కాంగ్రెస్ నాయకులు మంగేశ్ దేవ్‌తాడేతో కలిసి గురువారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 11 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, భూపెల్లి శ్రీధర్, సంతోశ్, భేదోడ్కర్ మోతిరాం, రాజు, యాదవ్ పాల్గొన్నారు.

బోరు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న గొర్ల రాజు యాదవ్

బోథ్: మండల కేంద్రంలోని దళితవాడలో ఎంపీ సోయం బాపూరావ్ బోరు వేయించి నీటి కొరతను తీర్చారని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్ అన్నారు. ఇటీవల కాలనీలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ బోరు వేయిస్తానని హామీ ఇచ్చారని, మాట ప్రకారం బోరు వేయించారని పేర్కొన్నారు. గురువారం బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు నల్ల గంగయ్య, జల్ల శివుడు, రోహిత్, లింగమ్మ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలో ముందుంటాం

ఎదులాపురం: ఆధ్యాత్మిక, సామాజిక సేవ కార్యక్రమాల్లో అంజనీపుత్ర సంస్థ ముందుంటుందని సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ తెలిపారు. గురువారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ పిల్లి రవి, గంగుల సంతోశ్, సూరినేని కిషన్, కాసర్ల సదానందం, గుర్రాల సురేశ్, దొమ్మటి తిరుపతి, కాసర్ల రాజు, పూసాల వెంకన్న, గుర్రాల కిరణ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందజేస్తున్న కాదే స్వామి

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన పుర్రె చిన్న గంగన్న ఇల్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న తలమడుగు బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ అసిస్టెంట్ కాదే స్వామి రూ. 10 వేలు, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో నేతుల గంగన్న, గడుగు పోచన్న, ఎలుగు ఆనంద్, రమేశ్, కృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఈశ్వరీబాయి

గుడిహత్నూర్: మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన కోట్నక బాదు పటేల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శాంతాపూర్‌కు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యురాలు నీలాబాయి, సర్పంచ్ తిరుమల్ గౌడ్ ఉన్నారు.

యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



ఆవిష్కరిస్తున్న మురళీధర్‌రెడ్డి, రాంచందర్

సారంగపూర్: మండలంలోని ప్యారమూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ ఆవిష్కరించారు. యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు చందు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, లింగారెడ్డి, సాగర్‌రెడ్డి, సాయన్న, రాజు, రవీందర్, మధుకర్ ఉన్నారు.

పశువైద్య శిబిరం

లక్ష్మణచాంద: సోన్ మండలం కూచన్‌పెల్లి గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశు వైద్యాధికారి మహేశ్ 25 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 52 పశువులకు నట్టల నివారణ మందులు, 15 పశువులకు, 300 గొర్రెలు చికిత్స చేశారు.



ఆదిలాబాద్: శోభాయాత్రలో జనసందోహం



నేరడిగొండ: మంగళహారతులతో మహిళలు

కల్యాణం.. కమనీయం

జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లోని పురవిధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, మాజీ ఎంపీ గెడం నగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. యువత పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది.

– సాక్షి, నెట్‌వర్క్



ఇచ్చోడ: సిరిచెల్మలో శోభాయాత్ర



తాంసి: మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు



తాంసి: అంతర్గాంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ నగేశ్



బేల: దోప్టాలలో సీతారాముల కల్యాణం



ఇంద్రవెల్లి: చిన్నారుల వేషధారణ



జైనథ్: పిప్పర్వాడ రామాలయంలో..



తలమడుగు: సుంకిడిలో శోభాయాత్ర



నేరడిగొండ: తేజాపూర్‌లో..



ఆదిలాబాద్: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



గుడిహత్నూర్: హనుమాన్ భక్తుల బైక్ ర్యాలీ



బోథ్: పూజలు చేస్తున్న అడె గజేందర్



ఆదిలాబాద్: హారతి ఇస్తున్న భక్తులు



జైనథ్: పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



ఉట్నూర్: తలంబ్రాలతో మహిళలు

ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం శాంతినగర్‌లోని ఆయన నివాసంలో అభిమానులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్ చేయించి తినిపించారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, దిగంబర్‌రావ్ పాటిల్, సంతోశ్, భేదోడ్కర్ మోతిరాం, సెడ్మకి ఆనంద్ రావ్, వెంకట్‌రావు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



తాంసి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పంటచేలలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతు కర్రలు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేయాలని కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: మనోజ్ కుమార్, ఏఈ విద్యుత్‌శాఖ, ఫోన్: 94408 11696

జోరుగా అక్రమ నిర్మాణాలు

- నిబంధనలకు విరుద్ధంగా పనులు
- పట్టించుకోని అధికారులు

నేరడిగొండ: పంటలు సాగు చేసే భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి దర్జాగా నిర్మాణాలు చేస్తున్నారు. ఇదంతా యధేచ్ఛగా సాగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారుల పక్కన ఉన్న విలువైన భూముల్లో చేపడుతున్న నిర్మాణాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. సాగు భూముల్లో వ్యాపార సముదాయాలను నిర్మిస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భూములకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అలాగే మండల కేంద్రం నుంచి కుంటాల జలపాతానికి వెళ్లే రహదారి భూములకు సైతం డిమాండ్ ఉంది. తక్కువ ధరకు ప్రభుత్వ భూమిని కొందరు కొనుగోలు చేస్తున్నట్లుగా సమాచారం. వాటిని కొనుగోలు చేయడమే కాకుండా అందులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. అసలు వ్యవసాయ భూములు కొనుగోలు చేసినట్లయితే ముందుగా వ్యవసాయేతర భూమిగా మార్పు చేయాల్సి ఉంటుంది. అందుకు రెవెన్యూ అధికారుల వద్ద నాలా అనుమతి పొందాలి. కొందరు మాత్రం తమ ధనార్జనే లక్ష్యంగా ఇవేమీ పట్టించుకోకుండా నిబంధనలను అతిక్రమించి అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండీ పడుతోంది. నిర్మాణ పనులు చకచకా సాగుతున్నా ఎలాంటి ఆటంకాలు లేకపోవడం గమనార్హం. ఒకటి కాదు.. రెండు కాదు.. పలుచోట్ల భారీస్థాయిలో అక్రమ నిర్మాణాలు సాగుతుండగా.. ఏ ఒక్క అధికారి కూడా తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నిర్మాణాలు ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అనుమతి లేకుండా నిర్మించిన ఇల్లు

చర్యలు తీసుకుంటాం..

వ్యవసాయ భూముల్లో నిర్మాణాలు చేపట్టాలని అనుకుంటే వ్యవసాయేతర భూములను చేసేందుకు తప్పనిసరిగా తహసీల్దార్ వద్ద నాలా అనుమతి పొందాలి. అలా పొందకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. వ్యవసాయ సాగు కోసం ఇచ్చిన ప్రభుత్వ భూముల్లో మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు నిబంధనలు వర్తించవు. ఒకవేళ అలా ఎవరైన నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తాం.

రమేశ్ రాథోడ్, ఆర్డీవో, ఆదిలాబాద్

రమాబాయి అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఇంద్రవెల్లి: రమాబాయి అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని రమాయి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తులజాపూరే శోభాబాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌లోని త్రివర్న బుద్ధ విహార్‌ను సందర్శించి, గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. మహనీయుల అడుగుజాడలో నడవాలన్నారు. ఈకార్యక్రమంలో మహామాయి ఉపాసిక సంఘం అధ్యక్షురాలు మాయాబాయి, ఎంపీటీసీ ఆశబాయి, సభ్యులు పాల్గొన్నారు.



శోభాబాయిని సన్మానిస్తున్న మహిళలు

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం ఆకోలి గ్రామానికి చెందిన శైలజ అనే మహిళ రక్తహీనతతో బాధపడుతుండగా రక్తం అవసరమని రిమ్స్ వైద్యులు సూచించారు. దీంతో ఆమె కుటుంబీకులకు 'బి' నెగిటీవ్ రక్తం దొరకకపోవడంతో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేష్ రెడ్డిను సంప్రదించారు. ఆయన తలమడుగు మండలం అర్లి గ్రామానికి చెందిన అశోక్‌కు సంప్రదించడంతో రక్తదానం చేశాడు.

భూమిపూజ

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో పూలాజీబాబా ధ్యాన మందిరానికి సర్పంచ్ సుగుణ గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పూలాజీ బాబా సంస్థాన్ డివిజన్ సభ్యులు కొండిభా జ్ఞానేశ్వర్ అరవింద్, న్యాయవాది పంద్రం శంకర్, అర్క లచ్చు, ఆడెం పొల్లు, మడావి జైతు, తొడసం నీలకాంత్, గోపాల్ పాల్గొన్నారు.

వారసంత వేలం

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ప్రాంగణంలో గురువారం 2023- 24 సంవత్సరానికి వారసంత, పశువుల సంత నిర్వహణకు వేలం నిర్వహించారు. బండారివార్ రాకేశ్ రూ.9.35 లక్షలు వేలం పాడి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సురేష్, కారోబారి గజానన్ పాల్గొన్నారు.

నేడు వారసంత వేలం

సిరికొండ: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వాహించే వారసంత వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వేలం పాల్గొనే వారు రూ. 10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రేపు చాలీసా పారాయణం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివ సాయి సమాజ్ జంగల్ హనుమాన్ మందిరంలో శనివారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. గురుస్వామి హనుమాన్ ఉపాసకులు బోగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గీతాలాపన, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల భక్తులు, హనుమాన్ దీక్షాపరులు హాజరై పారాయణ మహోత్సవం విజయవంతం చేయాలని కోరారు.

కౌన్సిలర్ల ఇళ్లకు బడ్జెట్ ప్రతులు

ఖానాపూర్: పట్టణంలో మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశానికి హాజరుకావాలని కోరుతూ మున్సిపల్ సిబ్బంది పలువురు కౌన్సిలర్ల ఇళ్లకు బడ్జెట్ సమావేశాల ప్రతులను అతికించారు. ఇప్పటికే మూడు సార్లు వాయిదాపడ్డ సమావేశానికి హాజరయ్యేందుకు ప్రతులను తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో నాలుగోసారి గోడలకు ప్రతులను అంటించారు. శుక్రవారం జరిగే బడ్జెట్ సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని అధికారులు ఈ ప్రతుల్లో పేర్కొన్నారు.

2న విగ్రహావిష్కరణ

లోకేశ్వరం: నిర్మల్‌లో వచ్చే నెల 2న మొల్లమాంబ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని కుమ్మర సంఘం జిల్లా కోశాధికారి తొడిశెట్టి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని గడ్‌చాందలో మొల్లమాంబ విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి అందజేశారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు తొడిశెట్టి రవికాంత్, కొత్తపల్లి విఠల్, పొతుగంటి సాయన్న, రామకృష్ణ ఉన్నారు.

చెట్లకొమ్మలు తొలగింపు

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ గ్రామ సమీపంలో నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారి పక్కన చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. ప్రయాణికులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వీఆర్‌ఏతో వేలాడుతున్న చెట్టు కొమ్మలను తొలగింపజేశారు.